AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
5-9-2026 (Saturday) MAIN EDITION

## భారత్ –జపాన్ వైమానిక విన్యాసాలు




**అక్షరటుడే, ఢిల్లీ :** భారత వైమానిక దళం, జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించే ద్వైపాక్షిక వాయుసేన విన్యాసాలు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వేదికగా ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 9 నుంచి 22 వరకు రెండు వారాల పాటు ఈ విన్యాసాలు జరగనున్నట్లు ఐఏఎఫ్ అధికారికంగా వెల్లడించింది. ఈ రెండో విడత విన్యాసాల్లో పాల్గొనేందుకు జపాన్ వాయుసేన బృందం శనివారం భారత్‌కు చేరుకుంది.

## ఎమ్మెల్యే కవ్వంపల్లి వివాదాస్పద వ్యాఖ్యలు



**అక్షరటుడే, కరీంనగర్:** మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వేషాలు వేసి అడుక్కునే రసమయి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. రసమయిని ఉద్దేశించి “బోడి టీచర్” అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. గోసి గొంగడితో వచ్చిన రసమయి ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మంత్రివర్గ విస్తరణ లేనట్టే..



అక్షరటుడే, హైదరాబాద్: మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్టే అన్నారు. ఢిల్లీలో క్యాబినెట్ విస్తరణ పై చర్చ జగలేదని పేర్కొన్నారు. కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చించినట్లు చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్‌రెడ్డి విమర్శలు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. 22ఏతో ప్రజల ఆస్తులను కాంగ్రెస్ దోచుకుంటోందన్నారు. భూ భారతి పేరుతో ప్రజలను కాంగ్రెస్ వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు.

## జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ



అక్షరటుడే, ఏపీ : ఏపీలో కొత్త జిల్లాలకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. 13 జెడ్పీల స్థానంలో 28 కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా 15 జెడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో పోస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

## పిల్లలను ఫోన్‌లకు దూరం చేయాలి : మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ :** పిల్లలు, విద్యార్థులు ఫోన్‌కు బానిసలుగా మారడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులతో శనివారం ఆయన మాట్లాడారు. స్క్రీన్ టైమ్ ఇప్పుడు ఒక రకమైన వ్యసనంగా మారిందన్నారు. పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి చూపితే.. ఫోన్ వ్యసనం నుంచి విముక్తి పొందవచ్చన్నారు. పిల్లలను సృజనాత్మక కార్యకలాపాలలో నిమగ్నం చేయాలని సూచించారు. కొన్ని ప్రధాన నగరాలు, విశ్వవిద్యాలయాలలో డ్రగ్స్ వాడకంపై సైతం ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని సూచించారు. యువతలో డ్రగ్స్ వ్యసనంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం ఎప్పుడు తెస్తారు : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తుందని, ఫీజుల నియంత్రణ చట్టం ఇంకెప్పుడు తెస్తారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. 2024 మే నెలలో స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్ రెండేళ్లుగా కేబినెట్ ను దాటి ఎందుకు ముందుకు రాలేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచుతూ దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. అయినా విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె నిలదీశారు.

# రెండేళ్లు టైమ్ ఇవ్వండి



**■ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం**
**■ సీఎం రేవంత్‌రెడ్డి ■ కొడంగల్‌లో గురు పూజోత్సవం**

**తాము అధికారంలోకి వచ్చాక విద్యా రంగంలో అనేక మార్పులు తెచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయడంతో పాటు, డీఎస్సీ ద్వారా నియామక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొడంగల్‌లో నిర్వహించిన గురు పూజోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్**

రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తనకు రెండేళ్లు సమయం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలు కమిట్‌మెంట్‌తో పనిచేయాలని సూచించారు. ఆర్థిక వెసులుబాటును బట్టి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. టీచర్లు ధర్నాలు చేస్తే విద్యార్థుల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు ధర్నాలు, నిరసనల్లో పాల్గొనకుండా విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలను భవిష్యత్ కథనాయకులుగా తీర్చిదిద్దేది టీచర్లే అన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ముఖ్యమంత్రి అయ్యానని తెలిపారు. 2028 డిసెంబర్‌లో.. లేదంటే 2029 మార్చి, ఏప్రిల్‌లో ఎలక్షన్ ఉండొచ్చన్నారు. అప్పుడు తాను టీచర్ల ముందుకు వస్తానని.. పాస్ చేస్తారా.. ఫెయిల్ చేస్తారా మీ ఇష్టం అన్నారు.

### నియామకాలు పూర్తి చేశాం

గతంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే, ఎప్పుడు పరీక్షలు జరిగేవో తెలిసేదికాదని సీఎం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు పూర్తిచేశామని తెలిపారు. 55 రోజుల్లోనే పరీక్షలు, నియామకాలు జరిగిపోయాయన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా 25,950 టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామని వెల్లడించారు. విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు.

### అవాస్తవాలు ప్రచారం

పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని సీఎం కోరారు. విద్యార్థులను అడ్డుపెట్టుకుని తమను బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి అలాంటివారి ట్రాప్‌లో పడొద్దన్నారు. తమ పాలనలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. 2024 నుంచి 2026 వరకు 37 వేల మంది, 2026-2027 విద్యా సంవత్సరంలో మరో 51 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. ఉపాధ్యాయుల పై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.

### అవును గుంపు మేస్త్రీనే..

కలెక్టర్లు, ఎస్పీలను ఒక పెన్ను సంతకంతో సులభంగా బదిలీ చేయవచ్చని సీఎం అన్నారు. కానీ తెలివైన ఉపాధ్యాయుల బదిలీల వెనుక కుటుంబ, సామాజిక అంశాలు ముడిపడి ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను గుంపు మేస్త్రీ అని కొందరు వెక్కిరిస్తున్నారని ఆయన అన్నారు. అయితే ఈ టీచర్లే తన గుంపు అని, వారికి తాను మేస్త్రీనని స్పష్టం చేశారు.



## కూటమిలో చేరికలపై క్లారిటీ వచ్చేనా?

**అక్షరటుడే, తమిళనాడు:** తమిళనాడు రాజకీయాల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ రాజకీయ అడుగులు వేగంగా పడుతున్నాయి. పార్టీ కూటమి విస్తరణపై దృష్టిసారించిన విజయ్, సెప్టెంబర్ 9న మిత్రపక్షాలతో అత్యంత కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో కొత్త రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుతో పాటు కూటమికి ఒక నూతన నామకరణం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి ఎండీఎంకే, సీపీఎం, సీపీఐ, వీసీకే, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలకు టీవీకే ఆహ్వానాలు పంపింది.

## రేవంత్ రెడ్డి అట్టర్‌ఫ్లాప్ : హరీశ్‌రావు

**అక్షరటుడే, సిద్దిపేట:** కాంగ్రెస్ సర్కార్ మూడేళ్ల పాలన పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ సిద్దిపేటలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్‌ఫ్లాప్ అయ్యారని మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేట్‌లో కలపడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఎగ్గొట్టడం వంటి చర్యలే ఇందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లుగా నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థుల చదువులు అర్ధాంతంగా ఆగిపోయే దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.






## కేఆర్ఎంబీ ఆదేశాలు తెలంగాణకు గొడ్డలిపెట్టు

**అక్షరటుడే, హైదరాబాద్ :** కేఆర్ఎంబీ ఆదేశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని కేఆర్ఎంబీ ఆదేశాలు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఎల్‌నినో పేరు చెప్పి కేఆర్ఎంబీ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని అన్నారు. ఏ నిబంధనల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారని ప్రశ్నించారు. ఏపీ దర్జాగా వెలిగొండకు సాగునీరు తరలిస్తుంటే, ఇక్కడ తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పంపులు మూసుకుని సహకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 1300కు చేరిన మృతుల సంఖ్య

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆకస్మిక వరదలతో అల్లకల్లోలం అయిన నేపాల్ ఇంకా తేరుకోలేదు. ఇరదల్లో ఇప్పటికే 1300 మందికి పైగా మృతి చెందారు. మరో 5 వేల మందికి పైగా గల్లంతు అయ్యారు. వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా 275 మంది భారతీయుల ఆచూకీ లభించలేదు. జల విద్యుత్ కేంద్రాలు ధ్వంసం అయ్యాయి. దీంతో నేపాల్‌లోని చాలా గ్రామాలు ఇంకా అంధకారంలోనే ఉన్నాయి. అధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. రసువాలోని బెత్రావతిలో విద్యుత్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



## నేపాల్‌ను భయపెడుతున్న మరో ముప్పు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** భారీ వరదలతో ఇప్పటికే కోలుకోలేని నష్టాన్ని చవిచూసిన నేపాల్‌ను మరో ప్రమాదం భయపెడుతోంది. దార్చులా జిల్లాలో భారీ కొండచరియలు విరిగిపడటంతో చౌలానీ నది ప్రవాహానికి పాక్షికంగా అడ్డంకి ఏర్పడింది. దీంతో నదికి దిగువన ఉన్న ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. చౌలానీ నదీ పరివాహక ప్రాంతాలు, దిగువ గ్రామాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అప్రమత్తం చేసేందుకు భద్రతా బలగాలను రంగంలోకి దించారు.

## లారీని ఢీకొన్న కారు.. 8 మంది మృతి



**అక్షరటుడే, కేరళ :** కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. మధ్య కేరళలోని త్రిసూర్ జిల్లాలో NH66పై శుక్రవారం రాత్రి 11:40 గంటల ప్రాంతంలో కైపమంగళంలోని పనంబిక్కున్ను వద్ద ఈ ప్రమాదం జరిగింది. గురువాయూర్ నుండి కొడుంగల్లూర్ వైపు వెళ్తున్న కారు లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టిందని పోలీసులు పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థులను తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డుపై అనుమతి లేని ప్రాంతంలో లారీని నిలపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.